# ఆత్మ హత్య

"చదువుకో" అన్నది సావిత్రి.
"నా మొహానికి చదువెందుకు?" అన్నది సావిత్రమ్మ.
"సంఘసేవ చెయ్యి" అన్నది సావిత్రి.
"ఇట్టా బతికితే చాలు" అన్నది సావిత్రమ్మ.
"ఈ బతుక్కంటే చావటం మేలు" అన్నది సావిత్రి.
"నిజమే కాని అందుక్కూడా ఓపిక లేదు" అన్నది సావిత్రమ్మ.
"ఎందుకని?" అడిగింది సావిత్రి.
"తీరికలేక!" చెప్పింది సావిత్రమ్మ.
"తీరిక చేసుకో" అన్నది సావిత్రి.
"ఎట్లా?" అడిగింది సావిత్రమ్మ.
"ఎట్లాగో ఒకట్లా" చెప్పింది సావిత్రి.
"ఏం మానుకోమంటావు? వంటమానుకోమంటావా! పిల్లల చాకిరీ మానుకోమంటావా?...."

ఈ మాటలకు సావిత్రికి కోపం వచ్చింది. గుడ్లెర్ర జేసింది. "పనిమనిషిని పెట్టుకో" అన్నది.

సావిత్రమ్మకి కళ్ళల్లో నీళ్ళు తిరిగినై. సావిత్రిని కావలించుకొని ఏడవాలనుకుంది. అది అనుకోవటం జరగటం వేరు.

"డబ్బో!" అన్నది సావిత్రమ్మ.
"మీ ఆయన్ని అడుగు" చెప్పింది సావిత్రి.
"లేందే! అన్నది సావిత్రమ్మ.

ఈ మాటకు సావిత్రికి మళ్ళీ కోపం వచ్చింది. సుఖంగా బ్రతకటం కూడా చేత కాదు సావిత్రమ్మకి. పైగా అన్నిటికీ తనే సమాధానం చెపుతూ కూర్చుంటుంది.

"డబ్బు లేనివాడిని నన్నెందుకు చేసుకున్నావు? అని అడుగు మీ ఆయన్ని" అన్నది సావిత్రి.

"డబ్బు లేదని తెలిసి నన్నెందుకు చేసుకున్నావు. అంటే?" అన్నది సావిత్రమ్మ, దిక్కుమొహం వేసుకుని. ఆ మొహం చూసేటప్పటికి సావిత్రి హృదయం కరిగిపోయింది ఆమె కళ్ళు చెమ్మగిలినై.

సావిత్రి ఒక వ్యక్తి సావిత్రమ్మ మరొక వ్యక్తి అనుకునేరు. కాదు సావిత్రి, సావిత్రమ్మ యౌవనదశ సావిత్రమ్మ సావిత్రియొక్క సంసార దశ. ఒకరితో ఒకరు మాట్లాడుకునే అవకాశం ఎలా కలిగిందంటా? నెమ్మదిమీద అన్నీ తెలుస్తయి.

ఆరోజు ఆడపిల్లలకు జడవేస్తూకూర్చుంది సావిత్రమ్మ. దుఃఖం పొంగి పొర్లి వొస్తూ వుంది ఆమె ఆదర్శాలన్నీ భగ్నమైపోయినై. మనోరథాలన్నీ మంటిలో కలిసినై. చివరికి కూతురికి చదువు చెప్పించుకోటానికి ఎక్కడా వీలవటం లేదు. బడి మాస్టరు దొరకడు దొరికితే తగిన డబ్బిచ్చుకోలేదు. బడి దూరం....పిల్ల ఒక్కతే వెళ్ళలేదు! నౌకర్ని పెట్టుకోటానికి డబ్బు లేదు. ఏం చెయ్యాలి?

చదువులేక పిల్ల చెడిపోతూ వుంది. తన పిల్ల చాలా చురుకైందీ తెలివైంది. కాని ఏం లాభం?

డబ్బువుండి మంచి స్కూల్లో చదువులూ, పెద్ద స్నేహాలూ చేసే అవకాశం వున్న పిల్లలు క్రమక్రమేణా వృద్ధిలోకి వొస్తుంటే, తన పిల్ల బీదవాళ్ళ పిల్లలతో తిరిగి క్రమక్రమేణా పాడైపోతూ వుంది.

ఇది సహించలేక, తనపిల్లకు తానే చదువు చెప్పుకుందామని ప్రయత్నించింది కొన్నాళ్ళు. తానిప్పుడు సంసారంలో పడిపోయి ఇలా అయిపోయింది. గాని ఒకప్పుడు బాగా చదువుకున్న మనిషే. తన తండ్రి కూచోబెట్టి చెప్పాడు.

కాని ఆ ప్రయత్నం కూడా కొనసాగలేదు పని [illegible] దానివల్ల పిల్ల ఏ పొరపాటు చదివినా చిరాకు పడటం, కొట్టటం........

తలుచుకుంటే తనకే గుండె తరుక్కుపోయేది. పిల్లకు తన దగ్గరవున్న చనువూ, తన మీదవున్న ప్రేమా నశించినై. ఒక్కొక్కప్పుడు ఆ పిల్ల చూసే చూపులకు ఆమె వొళ్ళు జలదరించేది. తన్ను గురించి తన కూతురు ఏమనుకుంటూ వుంది?

మరుక్షణం నుంచీ పిల్లకు చదువు చెప్పటం మానుకుంది. బ్రతికితే తరవాత సంగతి చూచుకోవచ్చు అనుకుంది. పిల్ల మళ్ళీ గాలికి తిరగటం మొదలు పెట్టింది.

"తనేమో తన సుఖమేమో తప్ప కూతురంటేనే లక్ష్యం లేదు. అదేమి మనిషో." అన్నారు ఇరుగు పొరుగు వాళ్ళు

"నా సంగతి మీ మీ కెందుకు?" అని వాళ్ళతో పోట్లాడింది సావిత్రమ్మ పిల్లని వొళ్ళోకి తీసుకొని కన్నీరు పెట్టుకుంది.

పిల్లని ముందు కూర్చొబెట్టుకొని తల వేళ్ళతో చిక్కుదీస్తూ ఇవన్నీ జ్ఞాపకం చేసుకుంది సావిత్రమ్మ. తన చిన్నతనం, ఆనాటి ఆదర్శాలూ కోర్కెలూ అన్నీ జ్ఞాపకంవొచ్చి కళ్ళు చీర చెంగుతో తుడుచుకొని గబ గబా జెడ పూర్తిచేసి పిల్లని పంపింది. తన పిల్ల అంట్లుతోమే గురవమ్మ కూతురుతో ఆడుకోవటానికి వెళ్తూవుందని ఆమెకు తెలుసు.

సావిత్రమ్మకి తటాలున, అద్దంలో తన మొహం చూచుకోవాలని బుద్ధిపుట్టింది. కాని తన మొహం అద్దంలో కనపడీ కనపట్టంతోనే, చేతులు వొణికినై, అద్దం జారి క్రిందపడి ముక్కలైంది. సరిగా సగానికి పగిలింది— రెండుముక్కలు. ఒక ముక్కలో సావిత్రి, రెండో ముక్కలో సావిత్రమ్మ. ఇద్దరూ వేరుకాదు. సావిత్రి, సావిత్రమ్మ యౌవనదశ. సావిత్రమ్మ సావిత్రి సంసార దశ.

సావిత్రమ్మ అద్దం పగిలిందనుకోవటం లేదు. తన హృదయమే పగిలి రెండు ముక్కలైంది అనుకుంది.

ఈ విధంగా సావిత్రమ్మ-సావిత్రీ మాట్లాడుకోటానికి వీలు ఏర్పడింది.

"నీ వంటి పిల్లకు ఎప్పుడూ జబ్బులే. ఎందుకో తెలుసా?" అనిఅడిగింది సావిత్రి.

"ఎందుకు?" అడిగింది సావిత్రమ్మ.

"నీ అనారోగ్యం వల్లే!" అన్నది సావిత్రి.

సావిత్రమ్మ దిక్కు-మొహం పెట్టింది.

"పోనీ ఆరోగ్యం అన్నా సరిగ్గా చూసుకో."

"ఎట్లా?"

"డాక్టరుకి చూపు"

"విశ్రాంతి తీసుకోమన్నాడు"

"తీసుకో"

సావిత్రమ్మకి అప్పటి కప్పుడే మూడునెల్ల గర్భిణి. తనకు ఇంట్లో పనిచేసిపెట్టే దిక్కు లేదు. పెద్ద పెద్ద డాక్టర్లకి చూపి మందులు తినే తాహతు లేదు. ఈ సంగతులన్నీ సావిత్రికి తెలుసు. ఆమె కొంచెం సేపు ఆలోచించి ఇలా అన్నది.

"సాయంకాలం కొంచెం షికారు వెళ్తూఉండు"

"చంటిదాన్ని తీసుకువెళ్ళాలి" అన్నది ఆమె.

"తీసుకు వెళ్ళు" అన్నది సావిత్రి.

"గాల్లో తిప్పితే దానికి జబ్బు" అన్నది ఆమె.

సావిత్రి ఆలోచించింది.

"ఈ సంసారాన్ని విడిచిపెట్టు" అన్నది.

"విడిచి" అని అడిగింది సావిత్రమ్మ.

"ఏ సంఘంలోనన్నా జేరు" అన్నది సావిత్రి.

"జేరి?" అడిగింది ఆమె.

"సంఘసేవ చేయి" అన్నది సావిత్రి.

ఈసారి సావిత్రమ్మ ఆలోచించింది. కుటుంబం విడిచిపెడితే సంఘం యేమంటుంది? పిల్లలు యేమవుతారు? తనభర్తో, ఇప్పుడు తన

సంఘానికి ఏం చెయ్యగలుగుతుంది? మళ్ళీ గర్భిణిగదా? మొగుణ్ణి విడిచి వెళ్ళిందంటారు అంతా. తనభర్త ఎంతబాధ పడతాడో! పాపం ఆయన తప్పేముంది? అయినా తనకి మల్లేనే బాధపడుతున్నాడు. ఆయనకీ తనకి మల్లేనే జీవితంలో లంగరు అందటంలేదు.

సావిత్రమ్మ ఈ ఆలోచనలన్నీ సావిత్రి గ్రహించింది. ఆమెకు కోపం వచ్చింది.

"నువ్వు పిరికిదానివి" అన్నది సావిత్రి.

"అవును" అని నిట్టూర్చింది సావిత్రమ్మ.

"ధైర్యం తెచ్చుకో" అన్నది సావిత్రి.

"ఓపికలేదు" అన్నది ఆమె.

ఈ మాటకు తన కంఠం యెవ్వరో నులుముతున్నట్లు బాధపడింది సావిత్రి. కళ్ళు చింతనిప్పులయినై.

"నీ కర్మ, అనుభవించు. ఇలాగే కుళ్ళి చావు" అన్నది.

ఈ మాటకు తోకతొక్కిన పామల్లే లేచింది సావిత్రమ్మ. ఒక్క-క్షణం సావిత్రికీ సావిత్రమ్మకి భేదం లేకుండాపోయింది. కాని మరుక్షణం సావిత్రమ్మ సావిత్రమ్మగారయికూర్చుంది. సావిత్రిని చూస్తే అసూయ కలిగింది. కంపరంపుట్టింది. నున్నగా దువ్వుకున్న సావిత్రిజుట్టు పీకాలనీ, యౌవనంతో నవనవలాడే సావిత్రి చెక్కిళ్ళు రక్కాలనీ లేచింది.

సావిత్రిని ప్రతిఫలిస్తున్న అద్దం ముక్క చేత్తో పట్టుకుంది.

వెంటనే సావిత్రి మాయం అయి సావిత్రమ్మలో కలిసింది. ఆ భారం మొయ్యలేక సావిత్రమ్మ తల ముగ్గు బుట్టయింది.

ఇప్పుడో
సావిత్రమ్మకి
అరవై యేళ్ళు.

)o....o(